సాక్షి
నంద్యాల
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో బుధవారం సాక్షి గణపతి స్వామికి, జ్వాలా వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహిచారు.



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాలకు సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు బుధవారం డ్యాం అధికారులు తెలిపారు.



ఔట్ పోస్టులకు అనుమతి

కర్నూలు: జిల్లాలోని ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు, మంత్రాలయం దేవస్థానం వద్ద ప్రముఖుల భద్రత, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు ఔట్‌పోస్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది.

న్యూస్‌రీల్

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం ఉండదు

- హౌసింగ్ పీడీ రామకృష్ణ



జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ రామకృష్ణ

చాగలమర్రి: జగనన్న లేఅవుట్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని హౌసింగ్ పీడీ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని నారాయణపల్లె రస్తా జగనన్న లేఅవుట్లలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 9,513 గృహాలను మంజూరు చేశామన్నారు. 5,117 గృహాలు పూర్తయ్యాయని, 2,468 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో బిల్లులు ఆగిపోతాయనే భయం వద్దని, ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట ఈఈ హరిగోపాల్, డీఈ నాగరాజు ఉన్నారు.

17న ఉమ్మడి జిల్లాల కబడ్డీ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 17న నూనెపల్లె మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కర్నూలు, నంద్యాల జిల్లాల కబడ్డీ సబ్ జూనియర్స్ బాలురు, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా చైర్మన్ నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, ప్రధాన కార్యదర్శి ఏపీ రెడ్డి బుధవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులు 55 కేజీల్లోపు బరువు ఉండాలన్నారు. 2008 మార్చి 19 తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో ఈనెల 17న ఉదయం 10 గంటలకు మున్సిపల్ పాఠశాల మైదానంలో హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్లు గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. మరింత సమాచారం కోసం 9849548926, 9441243601 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): స్థానిక మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. బుధవారం సూపర్-10, సూపర్-5 రకాలు అమ్మకానికి వచ్చాయి. సూపర్-10 రకం జనరల్ క్వింటా గరిష్ట ధర రూ.16,700, మధ్యస్థ ధర రూ.14,500, కనిష్ట ధర రూ.13,000 గా నమోదైంది. ఇదే రకం తాలు కాయ గరిష్ట ధర రూ.7,200, మధ్యస్థ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.5,000 గా పలికింది. సూపర్-5 రకం జనరల్ గరిష్ట ధర క్వింటా రూ.14,500, మధ్యస్థ ధర రూ.13,000, కనిష్ట ధర 5,000 గా నమోదైనట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రూప్-1 ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో గ్రూప్-1 పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న చెంచు, సుగాలీ ఎరుకల, యానాది కులాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు గ్రూప్-1కు దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు, బయోడేటా, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి ఈనెల 18లోగా శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ఏపీ గిరిజన గురుకుల పాఠశాల (బాలురు)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6వ తరగతిలో 63, 7వ తరగతిలో 45, 8వ తరగతిలో 24, 9వ తరగతిలో 23 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 10వ తేదీలోపు www.aptwgurukuam.ap.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాల్ టికెట్లను ఏప్రిల్ 11 డౌన్‌లోడ్ చేసుకుని 21వ తేదీ జరిగే ప్రవేశపరీక్షకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9490957267, 9491407061, 9882698893 నంబర్లను సంప్రదించాలన్నారు.

- ఉద్యాన పంట ఉత్పత్తిదారుల సంఘాలకు కలెక్షన్ సెంటర్లు
- దిగుబడుల నాణ్యత కాపాడుకునేందుకు పొలాల్లోనే నిర్మించుకునే సౌకర్యం
- జిల్లాకు 60 సెంటర్లు మంజూరు
- ఒక్కో సెంటర్‌కు రూ.15 లక్షలు.. రూ.11.25 లక్షల రాయితీ
- చిన్న, సన్నకారు రైతులకు చేయూత
- యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్న నిర్మాణాలు



కలెక్షన్ సెంటర్‌లో ఉల్లిగడ్డలు ఆరబోసి సంచులకు నింపుకుంటున్న రైతులు

ఉద్యానం.. ఫలప్రదం!

మూసధోరణి పంటల సాగు, మార్కెటింగ్, నిల్వ చేసుకునే కష్టాల నుంచి అన్నదాతలను బయట పడేయాలన్న దృఢ సంకల్పంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఉద్యాన, డ్వామా, ఏపీ ఎంఐపీ శాఖల ఆధ్వర్యంలో లాభదాయకమైన సేద్యాన్ని ప్రోత్సహించేందుకు పలు పథకాలు ప్రవేశపెట్టి పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు రాయితీలు కల్పిస్తోంది. తాజాగా వైఎస్సార్ క్రాంతి పథం సమన్వయంతో రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసి కలెక్షన్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో యూనిట్ విలువ రూ.15 లక్షలుగా నిర్ణయించి 75 శాతం (రూ 11.25 లక్షలు) రాయితీ ఇస్తోంది. ఉద్యాన శాఖ అధికారులు వీటిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తుండటంతో కలెక్షన్ సెంటర్లు నిర్మించుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి ఇలా..

పంట రకం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
అన్ని రకాల పండ్ల తోటలు	7,669	5,43,856
కూరగాయలు	14,549	8,08,476
పూల తోటలు	531	9,755
సుగంధ ద్రవ్యాలు	26,079	2,16,400
ఔషధ పంటలు	38	180
తోట పంటలు	240	436
మొత్తం ఉద్యాన తోటలు	49,106	15,79,103



కలెక్షన్ సెంటర్‌కు మంజూరు చేసిన గ్రేడింగ్ మిషన్ గురించి రైతులకు వివరిస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ: జిల్లాలో ఏటా పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు తదితర ఉద్యాన పంటలు 49,106 హెక్టార్లలో సాగవుతున్నాయి. 69,584 మంది రైతులు ఉద్యాన పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో వీరంతా పంటలను నిల్వ చేసేందుకు, ఉత్పత్తుల క్రయ, విక్రయాలకు మార్కెట్‌కు తరలించేందుకు అనేక ఇబ్బందులు పడేవారు. వీటిని దూరం చేసి రైతులకు అండగా నిలిచేందుకు జిల్లా వ్యాప్తంగా 60 రైతు కలెక్షన్ సెంటర్ల నిర్మాణాలకు అడుగులు వేసింది. ఇందులో ప్రస్తుతం 30 యూనిట్ల నిర్మాణాలు మొదలు పెట్టగా వీటిలో కొన్ని ప్రారంభించగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.

ఒక్కో యూనిట్‌కు రూ.11.25 లక్షల రాయితీ

ఒక్కో కలెక్షన్ సెంటర్ 60X40X15 అడుగుల కొలతలతో నిర్మాణానికి, అందులో ఉండాల్సిన గ్రేడింగ్ టేబుల్, ట్రేలు, ప్యాకింగ్, వేయింగ్, ఇన్వర్టర్ తదితర యంత్రాలతో పాటు వివిధ రకాల పరికరాల కొనుగోలు చేసేందుకు యూనిట్ విలువ రూ.15 లక్షలు ఖర్చవుతోందని అంచనా రూపొందించారు. ఇందులో పీపీసీ వాటా 25 శాతం (రూ.3.75 లక్షలు), ఎంఐడీహెచ్ వాటా 40 శాతం (రూ.6 లక్షలు) ఆర్‌కేవీవై వాటా 35 శాతం (రూ.5.25 లక్షలు) అందజేయడం జరుగుతుంది. ఈ మొత్తంలో ప్రభుత్వం 75 శాతం రాయితీ అంటే రూ.11.25 లక్షలు అందిస్తుంది. మిగిలిన 25 శాతం మండలాల వారీగా రూపుదిద్దుకున్న రైతు ఉత్పత్తి సంఘాలు సమకూర్చుకోవలసి ఉంటుంది. కాగా నిర్మాణానికి సంబంధించిన వస్తువులు, అందులో ఉండాల్సిన పరికరాలు రైతులు వారికి ఇష్టమైన కంపెనీల నుంచి ఎక్కడైనా కొనుగోలు చేసుకోవచ్చు.

జిల్లాలో 76 సంఘాలు

జిల్లా వ్యాప్తంగా 76 రైతు ఉత్పత్తి సంఘాలు రూపుదిద్దుకున్నాయి. సంఘంలో ఒకటి నుంచి రెండు, మూడు సమీప మండలాలకు చెందిన 20 నుంచి 200 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం 30 యూనిట్లు నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ప్రభుత్వ ఆదేశాలతో నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 13 కేంద్రాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన సెంటర్లు వివిధ దశల్లో ఉన్నాయి.



కలెక్షన్ సెంటర్‌కు మంజూరైన తూకం వేసే యంత్రం

రైతును రాజును చేయడమే లక్ష్యంగా..

రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడమే లక్ష్యంగా తీసుకు వచ్చిన ఈ కేంద్రాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులకు అనేక రకాల ఉపయోగాలు ఉంటాయి. పండించిన పంటలను కేంద్రానికి తీసుకు వచ్చి శుభ్రం చేసుకోవచ్చు. గ్రేడింగ్ చేసుకుని పంట నాణ్యతకు అనుగుణంగా ప్యాకింగ్ చేసుకోవచ్చు. అనుకున్న మేర ధర వచ్చే వరకు ఎంతకాలమైనా అక్కడే నిల్వ చేసుకోవచ్చు. సరుకు రవాణాకు అత్యంత అనుకూలం. వాహనాల్లో ఎక్కించి మార్కెట్‌కు తరలించేలా ఏర్పాట్లు ఉంటాయి. అన్నిటికంటే పంట రక్షణకు భరోసా ఉంటుంది.

యాంత్రీకరణకు రాయతీలు

ఉద్యాన యాంత్రీకరణకు రాయితీలు అందజేస్తున్నారు. ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులు 50 శాతం, ఇతరులు 40 శాతం రాయితీ పొందవచ్చు. మినీ ట్రాక్టర్‌కు రూ.75 వేలు, పవర్ టిల్లర్ రూ.40 వేలు, తైవాన్ స్ప్రేయర్ రూ.8 వేలు రాయితీ కల్పిస్తున్నారు. కరువు పరిస్థితుల్లో ఉద్యాన పంటలను రక్షించుకునేందుకు తోటల్లో నీటి కుంటల నిర్మాణానికి ఉద్యానశాఖ ద్వారా కమ్యూనిటీ నీటి కుంట అయితే రూ.20 లక్షలు, ఒక్కరే నిర్మించుకుంటే రూ.75 వేలు అందజేస్తున్నారు.

ఎంతో ఉపయోగకరంగా ఉంది



గతంలో పండించిన పంటలు అమ్ముకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. సంతలకు, మార్కెట్‌కు తరలించాలంటే ఎన్నో అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు ప్రభుత్వం మంజూరు చేసిన కలెక్షన్ సెంటర్ నిర్మించుకోవడంతో ఈ ఏడాది మేము పండించిన ఉల్లిగడ్డలు, ఇతర పండ్లతో పాటు ధాన్యం కూడా ఇక్కడే ఆరబోసుకుని, గ్రేడింగ్ చేసుకుని తూకం వేసుకుని ప్యాకింగ్ చేసుకుంటున్నాం. ధర లేకపోతే ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే అవకాశం కూడా ఉండటంతో ధైర్యంగా సాగుచేసుకునే అవకాశం దొరికింది. ఇంత భారీ రాయితీ కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– సతీష్‌రెడ్డి, శ్రీ వెంటేశ్వర ఉద్యాన సహకార సంఘం నాయకుడు, చిన్నపొదిల్ల, ప్యాపిలి మండలం

దళారుల బెడద తప్పినట్లే



మా సంఘంలో రుద్రవరం, ఆళ్లగడ్డ మండలాలకు సంబంధించిన 200 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఉద్యాన శాఖ 75 శాతం సబ్సిడీతో కలెక్షన్ సెంటర్‌లు నిర్మించుకోవాలని సూచించడంతో రుద్రవరం మండలం ఆలమూరులో 1, ఆళ్లగడ్డ మండలం ఆర్ కృష్ణాపురంలో 1 నిర్మించుకున్నాం. చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. మేమే అందరం కూర్చుని గిట్టు బాటు ధర నిర్ణయించి మార్కెట్ ఎక్కడ బాగుందో అక్కడికి సరఫరా చేసి విక్రయించుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ చర్యలతో రైతులకు దళారుల బెడద తప్పినట్లే

– నరసింహ గౌడ్, అధ్యక్షులు, రుద్రవరం రైతు సహకార సంఘం, ఆలమూరు

లాభసాటి సేద్యమే లక్ష్యం



సన్న, చిన్నకారు రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఉద్యాన పంటల సాగుపై రైతుల దగ్గరకు వెళ్లి అవగాహన కల్పిస్తూ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. ఉద్యాన పంటల సాగుకు ముందుకు వచ్చిన రైతులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నాం. పండించిన పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. వారి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని గతంలో ఎన్నడూ లేనంత రాయితీ అందజేస్తూ కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయిస్తున్నాం. లాభసాటి సేద్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– నాగరాజు, ఉద్యానాధికారి, నంద్యాల జిల్లా

ముగిసిన చౌడేశ్వరిదేవి మహాకుంభాభిషేకం





పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబ సభ్యులు, పూజలందుకున్న చౌడేశ్వరిదేవి అమ్మవారు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి మహాకుంభాభిషేక మహోత్సవాలు బుధవారం గ్రామోత్సవంతో ముగిశాయి. ఉత్సవాలు ఆలయ ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ప్రారంభమయ్యాయి. చివరి రోజు మహాకుంభాభిషేకంలో భక్తులతో పాటు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబ సమేతంగా హాజరై చౌడేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం చౌడేశ్వరిదేవి అమ్మవారికి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రిలో సూపర్ సేవలు



డాక్టర్లతో సూపరింటెండెంట్ ప్రసాదరావు

నంద్యాల టౌన్: స్థానిక సర్వజన ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రసాద్ రావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రి నుంచి సర్వజన ఆస్పత్రిగా రూపాంతరం చెందిన రెండేళ్లలోపే రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ సేవలు యురాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జన్ సేవలు ప్రవేశపెట్టడం సంతోషకరమన్నారు. నంద్యాలకు వైద్య కళాశాల మంజూరు చేయడం, అనతికాలంలోనే నిర్మాణం పూర్తి చేసి బోధనా తరగతులు ప్రారంభం కావడం ఇక్కడి విద్యార్థులు చేసుకున్న అదృష్టమన్నారు. ఆసుపత్రిలో త్వరలో క్యాన్సర్‌కు వైద్య సేవలు అందించడానికి ఉన్నతాధికారులకు సిఫారసు చేశామన్నారు. అలాగే అవయవ దానం స్వీకరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. నూతనంగా ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీ సేవల్లో ప్రతి మంగళ, గురు, శనివారాలు 20వ నంబరు ఓపీలో నెఫ్రాలజీ, 21 నంబర్ ఓపీలో న్యూరో సర్జరీ, ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో 20వ నంబరు ఓపీలో న్యూరాలజీ, 21 నంబర్ ఓపీలో యురాలజీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆప్తాల్మాలజీ విభాగంలో గ్లకోమా కనిపెట్టడానికి ప్రత్యేక పరికరాలు, మెల్ల కన్నుకు చికిత్స లాంటి అధునాతన సేవలు అందుబాటులోనికి తెచ్చామన్నారు. వీటన్నింటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆయా విభాగాల డాక్టర్లు కీర్తి రెడ్డి, జై బాబు, శ్రీకాంత్, శివనందిని, భరత కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు రేపు ఉద్యోగ మేళా

కర్నూలు(అర్బన్): నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు (దివ్యాంగులకు) ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎస్ రయిస్‌ఫాతిమా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి యూత్ -4 జాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్సీ ఉత్తీర్ణులై 18 నుంచి 32 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన దివ్యాంగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నిజాయతీకి మారుపేరు దామోదరం సంజీవయ్య

- జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల: నిజాయతీకి మారుపేరు దామోదరం సంజీవయ్య అని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ శ్రీనివాసులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, దళిత సంఘాల నాయకులు దామోదరం సంజీవయ్య గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో దళిత కుటుంబంలో జన్మించారన్నారు. నిజాయతీగా ప్రజలకు సేవలందించడంతో పాటు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి అందరి మన్ననలను పొందారన్నారు. సమాజానికి, వెనుకబడిన వర్గాలకు ఎంతో సేవ చేశారని, ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము పాలెం శ్రీనివాస్, దళిత నాయకులు జాన్సన్, మహేశ్వరి, లక్ష్మి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటల్స్, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీలకు సంబంధించిన 30 కేటగిరీల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు నవంబర్ 20న జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి దరఖాస్తు చేసుకున్న 26 కేటగిరీల అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌లు https://kurnool.ap.gov.in,https://nandyal.ap.gov.in,https://kurnoolmedicalcollege.ac.inలో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ లిస్ట్ వివరాలను సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే ఈ నెల 15 నుంచి 17వ తేదీ సాయంత్రంలోపు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందజేయాలన్నారు.

బీఈడీ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2023 ఆగస్టులో నిర్వహించిన బీఈడీ నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 847 మంది ఛాత్రోపాధ్యాయులు పరీక్షలు రాయగా 777 మంది ఉత్తీర్ణులయ్యారని, 70 మంది ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.



సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు, చిన్నారులు

సరస్వతీ..నమస్తుభ్యం

కొత్తపల్లి మండలం శివపురం సమీపంలోని కొలనుభారతిదేవి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలు కనుల పండువగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. సరస్వతీ దేవి అలంకరణలో కొలనుభారతిదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

– కొత్తపల్లి



సరస్వతీ దేవి అలంకరణలో కొలనుభారతి దేవి

క్లుప్తంగా

డ్రంకన్‌డ్రైవ్‌లో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను బుధవారం ఖరారు చేసినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. స్థానిక పొగాకు కంపెనీ జంక్షన్ వద్ద నడిగడ్డకు చెందిన షేక్ జకిరియా మద్యం తాగి వాహనం నడుపుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి కోర్టులో జడ్జి ఎదుట హాజరు పరచగా 14 రోజులు జైలు శిక్షను ఖరారు చేసినట్లు వారు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

జూపాడుబంగ్లా: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్‌ఐ మేరీజయంతి తెలిపిన వివరాలు.. కొత్తపల్లి మండలం పాతసిద్దేశ్వరం గ్రామానికి చెందిన కోటకొండ నరేష్(28)కు బండిఆత్మకూరు మండలం పెద్దదేవలాపురం గ్రామానికి చెందిన పార్వతికి మూడు నెలల క్రితం వివాహమైంది. వీరు జూపాడుబంగ్లా మండలం కొత్తసిద్దేశ్వరం గ్రామ పరిధిలోని పొలంలో కంది సాగు చేశారు. నూర్పిడి నిమిత్తం రెండు రోజుల కొత్తసిద్దేశ్వరం గ్రామానికి చేరుకున్నారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లే క్రమంలో మంగళవారం పురుగు మందు తాగి మంచంపై స్పృహ తప్పి పడిపోయాడు. భార్య గమనించి స్థానికులతో కలిసి కర్నూలు ఆస్పత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. కాగా అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

మార్కెట్ ఫీజు 100 శాతం వసూలు చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరానికి సంబంధించి మార్కెట్ ఫీజు 100 శాతం వసూలుకు చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ రాయలసీమ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు మార్కెట్ కమిటీ సెక్రటరీలను ఆదేశించారు. బుధవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఏడీఎం కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో జాయింట్ డైరెక్టర్ మాట్లాడారు. మార్కెట్ ఫీజు లక్ష్యాలను అధిగమించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెక్‌పోస్టులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మార్కెట్ కమిటీల ఆదాయం లీక్ కాకుండా ఉండేందుకు ప్రత్యేక టీమ్‌లు వేసి తనిఖీలు చేయించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏడీఎం నారాయణమూర్తి, నంద్యాల ఏడీఎం రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.


నంద్యాల: ప్రథమ నంది గాయత్రి ఆలయంలో సరస్వతీదేవికి పెన్నులతో అలంకారం


జూపాడుబంగ్లా: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు


కర్నూలు: ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం


కర్నూలు: చిన్నారితో అక్షరాలను దిద్దిస్తున్న అమ్మ


సంజామల: కానాల పాఠశాలలో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న విద్యార్థినులు

కనుల పండువగా 'వసంత' వేడుక

మాఘ శుద్ధ పంచమి(వసంత పంచమి)ని పురస్కరించుకొని బుధవారం సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. సరస్వతీ దేవి ఆలయాల్లో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవాలు, హోమాలు నిర్వహించారు. –సాక్షినెట్‌వర్క్


బండిఆత్మకూరు: కాకనూరు శారదాపీఠంలో కుంకుమార్చన


కోవెలకుంట్ల: సరస్వతీమాత ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


కర్నూలు: నన్నూరు సమీపంలోని ఆలయంలో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న పూజారి


బేతంచెర్ల: సరస్వతీ హోమ క్రతువులో పాల్గొన్న తల్లిదండ్రులు, చిన్నారులు


కర్నూలు: అక్షరాభ్యాస పూజలు చేస్తున్న అర్చకుడు

ఓట్ల లెక్కింపు కేంద్రాలపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం

● జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఓటర్ల జాబితా, స్ట్రాంగ్ రూముల నిర్వహణ తదితర అంశాలపై డీఆర్‌ఓ పద్మజతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకుడికి చెందిందనే ఆక్షేపణలు రావడంతో ఆర్జీఎం కాలేజ్‌ను లెక్కింపు కేంద్రం నుంచి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, శాంతిరాం ఇంజినీరింగ్ కాలేజీలలో ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అనుకూలంగా ఉన్నాయని, వీటిపై కూడా అభ్యంతరాలు ఎదురైతే కర్నూలు జిల్లా కేంద్రంలోని రాయలసీమ యూనివర్సిటీలోనే ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సయ్యద్ రియాజ్ బాషా, తెలుగుదేశం పార్టీ నాయకులు శివరామిరెడ్డి, బీజేపీ నాయకులు అభిరుచి మధు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: జిల్లాలోని పలు దేవస్థానాలకు ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలోని శ్రీ రూపాల సంఘమేశ్వర స్వామి దేవస్థానం, ఆదోని మండలం ఆదోని గ్రామంలోని శ్రీ కోట వీరభద్ర స్వామి దేవస్థానం, వెంగలాపురం ఆంజనేయ స్వామి దేవస్థానం, శ్రీ అంబా భవాని దేవత దేవస్థానం, కౌతాళం మండలం ఉప్పరహల్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల నియామకానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను మార్చి 1వ తేదీలోగా నగరంలోని మద్దూర్ నగర్‌లో ఉన్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామి వారు, సరస్వతీ హోమంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు బుధవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, సరస్వతీ హోమం చేశారు. స్వామి వారిని గరుడ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కే మనోహర రావు, కమిటీ సభ్యులు సోమనాథ మూర్తి, రామ మనోహర్, ప్రభాకర్, ఉమేష్, వాయుసేన సేవాదళ్, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఈరన్నస్వామికి 1.2 కేజీల వెండి విరాళం


దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామికి 1.270 కేజీల వెండిని కర్ణాటక రాష్ట్రం బల్లపూర్ (కంప్లి)కు చెందిన జె.వీరేష్, ఆయన కుటుంబ సభ్యులు బుధవారం విరాళంగా అందజేశారు. సంప్రదాయం ప్రకారం దాతలతో స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, పర్యవేక్షకులు మల్లికార్జున, రామ్మోహన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

18ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు


మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయించాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో తుది ఓటరు జాబితా ప్రచురణ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల సౌకర్యార్థం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులను సిద్ధం చేయాలన్నారు. 80 సంవత్సరాలు నిండిన ఓటర్లకు ఇంటిదగ్గరే ఓటు వేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆసక్తి ఉన్న వారిని నుంచి 12డీ దరఖాస్తులను స్వీకరించాలన్నారు.

'ఉపాధి' పనులు భేష్

● కితాబిచ్చిన ఎన్‌ఐఆర్‌డీ ప్రతినిధులు


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎన్‌ఐఆర్‌డీ ప్రతినిధులు

ఓర్వకల్లు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు చాలా బాగున్నాయని ఎన్‌ఐఆర్‌డీ ప్రతినిధుల బృందం ప్రసంశించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వేర్వేరు గ్రామాలలో చేపట్టిన ఉపాధి పనులను బృందం ప్రతినిధి నీరజ నేతృత్వంలో 27 మంది సభ్యులు పరిశీలించారు. హుసేనాపురంలో చెక్‌డ్యామ్‌లో పూడికతీత పనులు, ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ను పరిశీలించారు. అనంతరం చింతలపల్లె గ్రామంలో చీనీ తోట పెంపకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఓర్వకల్లు మండల మహిళా సమాఖ్య భవనంలో పవర్ ప్లాంట్ ప్రజెంటేషన్(పీపీటీ) ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల పనులను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి వివరించారు. జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మించుకున్న ఇళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, అదనపు పీడీ మాధవీలత, ఏపీడీలు కృష్ణమోహన్, లక్ష్మన్న, ఎంపీడీఓ మల్లీశ్వరి, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావొద్దు

● డీఈఓ శామ్యూల్


మాట్లాడుతున్న డీఈఓ శ్యామూల్

కర్నూలు కల్చరల్: పరీక్షల సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకూడదని డీఈఓ శామ్యూల్ అన్నారు. నేషనల్ చైల్డ్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్‌కు పరీక్షా పర్వ్ పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల ఇష్టాలను, వారి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త సీహెచ్ విజయజ్యోతి కుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలన్నారు. ప్రధాన వక్త చిట్టిబాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు పాజిటివ్ దృక్పథాన్ని అలవర్చాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఉప విద్యాధికారి హనుమంతరావు, ఆఫీస్ పర్యవేక్షకులు కోటేశ్వరరావు, సెక్టోరియల్ ఆఫీసర్స్ కె.సునీతా రెడ్డి, జి.సురేష్ రాజు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహానంది ఆలయ అభివృద్ధికి కృషి

● ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


వసతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా, చిత్రంలో ఆలయ అధికారులు

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మహానంది దేవస్థానంలో రూ.10.50 కోట్ల దేవస్థానం నిధులతో నూతనంగా నిర్మించనున్న నంది సదనంలో 50 వసతి గృహాల సముదాయానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయ కార్యనిర్వాహణాధికారిగా కాపు చంద్రశేఖర్ రెడ్డిని నియమించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే దేవస్థానం ప్రాంగణంలో తన సొంత డబ్బు రూ.మూడు కోట్లు వెచ్చించి సుందరీకరణ పనుల్లో భాగంగా ల్యాండ్ స్కేపింగ్, భక్తులు ఆహ్లాదంగా సేద తీరేందుకు పార్కులు, రాతితో బెంచీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో మహానంది ఆలయం నిరాదరణకు గురైందన్నారు. కనీసం సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉండేదన్నారు. ప్రస్తుతం రూ.18 కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. త్వరలోనే మహానంది ఆలయం డిప్యూటీ కమిషనర్ హోదా నుంచి రీజినల్ జాయింట్ కమిషనర్ హోదాకు చేరుతుండటం హర్షించదగిన విషయమన్నారు. బండిఆత్మకూరు మండలం నవనందుల్లో ఒకటైన కృష్ణనంది, ఓంకారం ఆలయ పరిధిలోని భూముల వివాదాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మహానందీశ్వర స్వామి సొమ్మును దోచుకున్నారు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకులు మహానందీశ్వర స్వామి సొమ్మును దోచుకున్నారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆలయ అభివృద్ధికి పాటుపడుతూ ఈఓ, ధర్మకర్తల మండలికి పూర్తి అధికారాలు ఇస్తూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వచ్చానన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.4.60 కోట్ల నిధులను రాబట్టి వసతి గృహాల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రూ.80 లక్షలతో కోనేరుల మరమ్మతులు సాగుతున్నాయన్నారు. శ్రీశైలం ఆలయాన్ని తిరుమల తరహాలో, మహానంది ఆలయాన్ని శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

వేతనాలను పెంచేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డితో పాటు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొమ్మ మహేశ్వర్ రెడ్డిలను మహానంది దేవస్థానం ఏజెన్సీ ఉద్యోగులు సన్మానించారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలతో ఎమ్మెల్యే శిల్పా మాట్లాడి ఒక్కొక్కరికి సుమారు రూ.5 వేలకు పైగా వేతనం పెరిగేందుకు దోహదపడ్డారని ఏజెన్సీ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మండల నేత ఒంటెద్దు వీరారెడ్డి, సర్పంచ్ శిరీష, మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, ఎంపీటీసీ బంగి వెంకటేశ్వర్లు, నిత్యాన్నదాన కూరగాయల దాత టి.ప్రసాద్, సీనియర్ నేతలు కొండా మధుసూదన్‌రెడ్డి, రవిస్వామి, కుంచపు శ్రీనివాసులు, రఘురామిరెడ్డి, ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు పాల్గొన్నారు.